
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31(ఆదివారం)
కనిష్ఠం : 26

ఎవరి నమ్మకాలు.. వారివి!

నీట్‌లో తమ పిల్లలు ర్యాంక్ సాధించాలనేది తల్లిదండ్రుల ఆశ.. ఆ ఆశను నిజం చేసుకోవాలని రాజమహేంద్రవరం, కాకినాడ, యానాం పరీక్షా కేంద్రాల వద్ద ఒకరు ప్రార్థన చేస్తుంటే.. మరొకరు తాడుకడుతూ.. ఇంకొకరు జాగ్రత్తలు చెబుతూ ఇలా కెమెరాకు చిక్కారు..


గెలుపుతాడు..


కంగారుపడకు..


ధైర్యంగా రాయమ్మా






రెడీ 1


2


3



ఆశలు..బంద్!

ఒక నిమిషం ఆలస్యమై.. ఏడాదంతా తారుమారై!

ఒక్క నిమిషం చాలు జీవితాలు తారుమారైపోవడానికి.. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ, కేంద్రం లో నీట్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు.. కాస్త ముందు వచ్చిన ఇద్దరమ్మాయిలు పరుగున పరీక్షా కేంద్రానికి చేరుకోగా.. ఈ బాలుడు నిమిషం ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయడానికి వీల్లేక వెనుదిరిగాడు.. ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ముంచిన వాన



- జిల్లాలో భారీ వర్షం
- ఈదురుగాలులకు పడిపోయిన కొబ్బరిచెట్లు
- కళ్లాల్లోనే ఉండిపోయిన ధాన్యం రాశులు
- జోరువానతో పలుచోట్ల తడిచిపోయిన ధాన్యం
- ఆవేదనలో రైతులు
- వర్షంతో వేడిమి నుంచి ఉపశమనం పొందిన ప్రజలు

జిల్లాను జోరువాన ముంచెత్తింది. కొన్నిచోట్ల ఈదురు గాలులు వీయడంతో హోర్డింగులు, తోటల్లో మామిడికాయలు రాలిపోయి పడిపోయాయి. వర్షంతో వేసవిలో వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కానీ, వరి కోతల సమయం కావడంతో పొలాల్లోని కళాల్లోనే ఉండిపోయిన ధాన్యం తడిచి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ నగరంలో వర్షం ధాటికి నీటమునిగిన రహదారి


కరప ఎంపీడీవో కార్యాలయం ఎదుట జలమయమైన రహదారి

కాకినాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కురిసిన వర్షానికి జిల్లా తడిసిముద్ద య్యింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి వాతావరణం కాస్త మేఘావృతంగా ఉన్నా 10గంటల సమయంలో పూర్తిగా కారుమబ్బులు కమ్మేశాయి. ఈదురుగాలులు వీచాయి. మూడుగంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో జిల్లా అతలాకుతలమైంది. అత్యధికంగా కాజులూరు మండలంలో 10సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు కొత్తపల్లి, పిఠాపురం, కరప, జగ్గంపేట, పెద్దాపురం, కరప, కాజులూరు, ప్రత్తిపాడు, తుని, సామర్లకోట మండలాల్లో భారీగా వర్షం కురిసింది. ఈదురుగాలులతో ఎక్కడికక్కడ మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడికాయలు రాలిపోయాయి. వరి పంటకూ భారీ నష్టం వాటిల్లింది. కళ్లాల్లో ఉన్న ధాన్యం పలుచోట్ల పూర్తిగా తడిసిపోయింది. రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పలు గ్రామాల్లో అంధకారం అలుముకుంది. చెట్లు నేలనంటాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నీట మునిగిన కాకినాడ

కార్పొరేషన్(కాకినాడ): కాకినాడలో ఆదివారం కురిసిన భారీవర్షానికి నగరంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరుతో చెరువులు తలపించేలా వర్షపునీరు ప్రవహించింది. వాహనదారులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు. టూటౌన్ ప్రాంతం, సినిమా రోడ్డు, మెయిన్ రోడ్డు, దేవాలయం వీధి నీటమునిగాయి. పెద్దమార్కెట్‌లో మోకాళ్ల లోతు నీరు చేరడంతో వ్యాపారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.


ఈదురుగాలల ధాటికి తునిలో నేలరాలిన మామిడి కాయలు


కరప మండలం వాకాడలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటిన తరలిస్తున్న రైతులు


గొల్లప్రోలులో కురుస్తున్న భారీ వర్షం

కాకినాడ సాగరతీరంలో..

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు


మూడోరోజు పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల

- పురుషుల విజేత జట్టు నెల్లూరు
- మహిళల విజేత జట్టు కృష్ణా
- పోటీల ముగింపునకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల

7

జిల్లాలో నీట్ పరీక్షకు 97.53శాతం హాజరు

కలెక్టరేట్ (కాకినాడ), మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం పది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 2880మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 2812మంది హాజరయ్యారు. అంటే 97.53శాతం పరీక్షలు రాశారు. అభ్యర్థులను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకుండా ఉండేలా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరీక్షకేంద్రాలవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కాకినాడలో భారీ వర్షం కురిసింది. దీనివల్ల సుదూరం నుంచివచ్చే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు భారీ వర్షం, మరొకవైపు ట్రాఫిక్ జామ్‌తో విద్యార్థులు ఇబ్బందులు గురయ్యారు. జేఎన్‌టీయూ పరీక్ష కేంద్రాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు పరిశీలించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్ (కాకినాడ), మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలని సూచించారు.

రేపు ఖేలో ఇండియా బీచ్ క్రీడల ఎంపికలు 7
వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 7


అన్నవరం సత్యదేవుడి ఆలయం ముస్తాబు

సత్యదేవుడి కల్యాణం

చూడగ రారండి!

- 7 నుంచి 13 వరకు ఉత్సవాలు
- అన్నవరంలో ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, మే 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ప్రతి ఏటా వైశాఖశుద్ధ దశమి నుంచి వైశాఖ బహుళపాడ్యమి వరకు జరుగుతాయి. విశ్వావసు నామసంవత్సరంలో ఉత్సవాలు 7న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేయడంతో ప్రారంభమై 13వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగ మహోత్సవంతో ముగుస్తాయి. దివ్యకల్యాణం 8న రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. స్వామి కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాకారం, గోపురాలకు రంగులు వేస్తున్నారు. స్వామివారి సన్నిధిలో జరిగే వేడుకల్లో వార్షిక కల్యాణోత్సవాలకు ప్రాధాన్యం ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచి దివ్యకల్యాణం తిలకించేందుకు వేలాదిగా రత్నగిరికి తరలివస్తారు. ఇప్పటికే పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.వారం రోజులు కొండపై వైదిక కార్యక్రమాలతో పాటు కొండదిగువున గ్రామోత్సవాలు (వివిధ వాహనసేవలు) నిర్వహిస్తారు. దివ్యకల్యాణోత్సవాలకు పెండ్లిపెద్దలుగా క్షేత్రపాలకులైన సీతారాములు వ్యవహరిస్తారు. వారం రోజులు ఆర్జితసేవ నిత్యకల్యాణం తాత్కాలికంగా నిలుపుదల చేస్తారు. ఉత్సవాలకు బడ్జెట్‌లో రూ.50 లక్షలు కేటాయించారు.

షెడ్యూల్ ఇలా..

- తొలిరోజు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగిస్తారు.
- రెండోరోజున రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణం.సత్యదేవుడిని వెండి గజవాహంపై, అమ్మవారిని వెండి గరుడ వాహనంపై పెండ్లి పెద్దలైన సీతారాములను వెండి పల్లకిలో ఊరేగిస్తారు.
- మూడో రోజు సాయంత్రం 6.30 గంటలకు నవదంపతులకు అరుంధతీ నక్షత్ర దర్శన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 9 గంటలకు కొండదిగువున రావణబ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం జరగనుంది.
- నాలుగోరోజున మధ్యాహ్నం 2.30 గంటలకు పండిత సదస్యం ఉంటుంది. పండితులు సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నూతన దంపతుల సమక్షంలో తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు.రాత్రి 9గంటలకు పొన్నవాహనంపై గ్రామోత్సవం.
- ఐదోరోజు నూతన దంపతులైన సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లను మధ్యాహ్నం 2.30 గంటలకు దేవస్థానం ఉద్యానవనానికి తీసుకువచ్చి వనవిహార మహోత్సవం చేపడతారు. సాయంత్రం 4 గంటలకు పెద్దరథంపై గ్రామోత్సవం
- ఆరో రోజున ఉదయం 5 గంటలకు శేష హోమాలు, కోట్నాలు నిర్వహించి పండితులుఅమ్మవారితో గౌరీపూజ చేయిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు.
- చివరి రోజున రాత్రి 8 గంటలకు నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో, స్వామి,అమ్మవార్లను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీ తాంబూలాలు, మహిళలకు రవికలను ఉచితంగా అందజేస్తారు.

రుణం ఈజీ కాదు..!



సర్కారు వారి మాటా బ్యాంకులు వినవే!

రుణం అంత ఈజీకాదు.. ప్రభుత్వం తరఫున అర్హులని ఎంపిక చేసినా సరే రుణం రాదు.. వెనుక ఏదో ఒక హామీ లేనిదే బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకు రావు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం..అటు పాలకుల నుంచి ఇటు అధికారుల వరకూ చెప్పేది ఇదే.. వారిచెప్పినట్టు జరుగుతుందా అంటే జరగదు.. కార్పొరేషన్ రుణాలే అందుకు ఉదాహరణ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,303 యూనిట్లకు అర్హులను ఎంపిక చేసి 19 బ్యాంకులకు పంపగా కేవలం 1423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- కార్పొరేషన్ రుణాలకు చుక్కలు
- 6,178 మంది లబ్ధిదారుల ఎంపిక
- 1,423 మందికే లోన్లు మంజూరు
- మిగిలిన దరఖాస్తులు పెండింగ్
- రుణాలివ్వడానికి బ్యాంకుల కొర్రీలు
- రకరకాల కారణాలతో మోకాలడ్డు
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి తూట్లు

కార్పొరేషన్ల రుణాలకు బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. లబ్ధిదారులను వడపోత ద్వారా అర్హులను పక్కాగా గుర్తించి రుణాల మంజూరుకు జాబితాలను బ్యాంకులకు పంపితే రకరకాల సాకుతో తిరస్కరించేస్తున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పథకాలకు ఎంపిక చేసిన 6,178 మంది లబ్ధిదారుల వివరాల ను 19 బ్యాంకులకు పంపగా వీరిలో కేవలం 1,423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ఆమోదం తెలిపాయి. మిగిలిన దరఖాస్తుల్లో కొన్ని తిరస్కరించగా.. మరికొన్ని పెండింగ్‌లో ఉంచేశాయి.

ఎంపికకే నానా తంటాలు..

గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ,కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాలకు మంగళం పాడేసింది. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి అందివ్వాల్సిన యూనిట్లను సైతం పక్కన పడేసింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది బీసీ, కాపు సామాజికవర్గాల పేదలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చంద్రబాబు తాజాగా సీఎం అయిన తర్వాత మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 7,303 యూనిట్లు కేటాయించారు. స్వయం ఉపాధి యూనిట్లకు వీలుగా 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఎంపికైన లబ్ధిదారుడు జనరిక్ మందుల దుకాణం ఏర్పాటకయ్యే రూ.8 లక్షల్లో రూ.4 లక్షలు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ భరిస్తుండగా మిగిలిన రూ.4 లక్షలు రుణం మంజూరు చేస్తారు. ఇలా రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలకు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించింది.ఈ పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా స్పందన వచ్చింది. మంజూరైన యూనిట్లు 7,303 దరఖాస్తు చేసుకున్నవారు 1.11 లక్షల మంది.ఎలాగైనా పథకం తమకే దక్కాలని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. దరఖాస్తులన్నీ పరిశీలించిన అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,303 మంది లబ్ధిదారులను అతికష్టంపై ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా నుంచి 2,684 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2,314, కోనసీమ జిల్లా నుంచి 2,305 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రభుత్వం తరఫున సబ్సిడీ అందేలా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు.వీరందరికి బ్యాంకు రుణాలు అందేలా ఆయా మండలాల్లో ఎండీవోలు సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లకు సిఫార్సు చేశారు.సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు.

పేదలకు సిబిల్ స్కోర్ లేదట?

ఉమ్మడి జిల్లాలో ఆయా మండలాల వారీగా ఎండీవోలు లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు పంపించారు. తీరా వీటిని పరిశీలించిన బ్యాంకులు రుణాలివ్వడానికి నానా తిప్పలు పెడుతున్నాయి. లబ్ధిదారుడి సిబిల్ స్కోరు బాగోలేదని.. గతంలో బ్యాంకు రుణం సరిగ్గా చెల్లించలేదని, గతంలో వేరే పథకానికి ఎంపికయ్యారని తదితర కారణాలతో ఎక్కడికక్కడ రుణాలివ్వ కుండా తిరస్కరిస్తున్నాయి.ఎంపిక చేసిన యూనిట్‌కు రుణం ఇవ్వడానికి కుదరదంటూ రకరకాల సాకులు చెబుతున్నాయి. కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులంతా నిరుపేదలు.వీరికి అసలు సిబిల్ స్కోరు గురించి కనీస అవగాహన ఉండదు.కానీ ఆ పేరుతో రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తుండడంతో ఆయా పేద లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం చొరవ చూపి పేదలకు సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

1423 మందికి మాత్రమే..

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ జిల్లాలో 19 బ్యాంకులకు అధికారులు 2,478 మందిని ఎంపిక చేసి దరఖాస్తులు జాబితా పంపారు. వీటిలో కేవలం 722 మందికే బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి.199 తిరస్కరించగా 1,557 పెండింగ్‌లో ఉంచేసి వీటిని కూడా రేపోమాపో తిరస్కరిస్తున్నట్టు వెల్లడించనున్నాయి. ఎస్‌బీఐకి 773 దరఖాస్తులు పంపితే 243 మంజూరు చేసి 98 దరఖాస్తులను తిరస్కరించింది. మరో 432 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. యూనియన్ బ్యాంకుకు 746 మంది జాబితా పంపితే 242 మందికే రుణాలు మంజూరు చేసింది. 40 దరఖాస్తులను తిరస్కరించి 464 పెండింగ్‌లో ఉంచేసింది.

తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలో 15 బ్యాంకులకు 2,062 మంది జాబితా పంపగా కేవలం 353 మందికే రుణాలివ్వడానికి అంగీకరించాయి. 66 మంది రుణ దరఖాస్తులు తిరస్కరించగా 1,643 పెండింగ్‌లో ఉంచేశాయి. స్టేట్ బ్యాంకుకు 657 దరఖాస్తులు పంపితే 84 మంది రుణాలకు మాత్రమే ఓకే చెప్పింది. 12 మందివి తిరస్కరించి 511 పేర్లు పెండింగ్‌లో ఉంచేసింది. ఇండియన్ ఒవర్సీస్ బ్యాంకుకు 57 పేర్లు పం పితే ముగ్గురికే రుణం మంజూరు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ,పంజాబ్ నేషనల్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకు ఒక్క లోను ఇవ్వలేదు.

కోనసీమ

కోనసీమ జిల్లాలో 14 బ్యాంకులకు 1,638 పేర్లు పంపితే 348 మందికి మాత్రమే లోన్లు మంజూరయ్యాయి. 205 దరఖాస్తులు తిరస్కరించగా 1,085 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేశాయి.కెనరా బ్యాంకుకు 100 పంపితే 35 మందిని తిరస్క రించింది.చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు 115 పంపితే 30 తిరస్క రించింది. స్టేట్‌బ్యాంకుకు 509 పంపితే 34 మందికే రుణాలిచ్చి 21 పేర్లు తిరస్కరించింది. యూనియన్ బ్యాంకుకు 532 పంపితే 161 మందికే లోన్లు ఇవ్వగా 85 తిరస్కరించింది. వేలల్లో పేర్లను బ్యాంకులు తిరస్కరిస్తుండడంతో అటు బీసీ కార్పొరేషన్, ఇటు ఎండీవోలు తలలు పట్టుకుంటున్నారు.ఒకసారైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలా నీట్‌గా..!


రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం


చెవి దిద్దులు తీసివేస్తూ...


జడలో క్లిప్పు తొలగిస్తూ...

నీట్ పరీక్షలు అంటే తొలుత గుర్తొచ్చేది తనిఖీ అంశం. అధికారులు, పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆదివారం రాజమహేంద్రవరం, కాకినాడ కేంద్రాల వద్ద విద్యార్థులు నీట్ పరీక్ష రాసేందుకు సంసిద్ధమైన దృశ్యాలే ఇవి




కాకినాడలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి కోసం వర్షంలో కుటుంబసభ్యులు

ముత్యాల తలంబ్రాలు 30వేల ప్యాకెట్లు సిద్ధం

సత్యదేవుని కల్యాణం తిలకించే భక్తులకు అందజేసే ఏర్పాట్లు


ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

అన్నవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వతేదీ రాత్రి జరిగే సత్యదేవుని కల్యాణం సందర్భంగా స్వామి,అమ్మవార్లు ఒకరిపై ఒకరు వేసుకునే ముత్యాల తలంబ్రాలను అధికారులు ప్యాకింగ్ రూపంలో తయారుచేస్తున్నారు. సుమారు 30వేల ప్యాకెట్లను తయారుచేసి కల్యాణం అనం తరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా కల్యాణం వీక్షించేందుకు విచ్చేసే భక్తులకు అందజేయనున్నారు. సేవాసంస్థ మహిళలకు ఈ బాధ్యతను అప్పగించారు.

వెండివాహనాలకు మెరుగులు

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 7నుంచి ప్రారంభమయ్యే గ్రామసేవల్లో స్వామి,అమ్మవార్ల ఊరేగింపునకు వినియోగించే వెండివాహనాలకు మెరుగులు దిద్దుతున్నారు. కాకినాడకు చెందిన శ్రీ లక్ష్మీశ్రీనివాస జ్యూయలరీ వర్క్స్ అధినేత పాటోజు వెంకట లక్ష్మణమూర్తి, ఆయన బంధుమిత్రులు ఈ పనిని ఉచితంగా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తొలిరోజున వెండి ఆంజనేయవాహనం, రెండోరోజున వెండి గరుడవాహనం, వెండిగజవాహనం, వెండిపల్లకి, స్వామి, అమ్మవార్లు కల్యాణానికి ఆశీనులయ్యే వెండి సింహాసనం, వెండిరథం త దితర సేవలు కల్యాణోత్సవాల్లో జరగనున్నాయి.


వెండి వాహనాలకు తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

పలు సేవలు నిలుపుదల

ఈనెల 7 నుంచి 13 వరకు సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా పలు ఆర్జితసేవలను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణం, ఆయుష్యహోమం, సహస్రదీపాలంకరణ సేవ, పంచహారతులసేవ, శుక్రవారం జరిగే చండీహోమం, శనివారం జరిగే ప్రాకారసేవ, ఆదివారం జరిగే రథసేవ, పౌర్ణమిరోజున జరిగే ప్రత్యంగిర హోమాలు నిలుపుదల చేస్తామని భక్తులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరారు.

ఆహ్వానపత్రికల అందజేత

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలకు రావాలని ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూలకు ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశేష అభిషేక పూజలు, చండీహోమం

ఐ.పోలవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో నాల్గోరోజు ఆదివారం గవ్యాంతము, విశేష అభిషేక పూజలు, చండీహోమం, కళాహోమం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సాయంత్రం స్వామివారు నంది వాహనంపై ఆసీనులై మురమళ్ళ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సదస్యం, సభపూజ, పండిత సత్కారం కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూల విరాట్లను ప్రత్యేకంగా అలంకరించి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అయోధ్య రామధనస్సుకు పూజలు

అయోధ్య రాముని కోసం తయారుచేసిన ధనస్సుకు భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం అయోధ్య రాముని కోసం కిలో బంగారం, 13 కిలోల వెండితో ధనస్సును తయారు చేయించారు. ధనస్సుకు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మేళతాళాలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్ వద్ద యనమండ్ర సత్యసీతారామశర్మ, యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సాహ 'బరి'తం..

- కాకినాడ సాగరతీరంలో ముగిసిన కబడ్డీ పోటీలు
- పురుషుల విజేత నెల్లూరు
- మహిళల విజేత కృష్ణా

సర్పవరం జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మూడు రోజులు జరిగిన బీచ్ కబడ్డీ పోటీలు ఆద్యంతం అలరించాయి. అలల హోరు మధ్య కూతల మోతతో కాకినాడ సముద్ర తీరం మార్మోగింది. ఫ్లడ్‌లైట్ల వెలుగులో.. అభిమానుల గోలతో అక్కడంతా సందడి వాతావరణం నెలకొంది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సౌజన్యంతో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో జ రుగుతున్న 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి, అమలాపురం, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు తిలకించారు.

విజేతల వివరాలు...

చివరిరోజు మహిళల విభాగంలో చిత్తూరు-కృష్ణా జిల్లాల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగంలో నెల్లూరు, ప్రకాశం జట్లు హోరాహోరీగా తలపడగా నెల్లూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా ప్రకాశం జట్టు నిలిచింది. విజేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ బహుమతులను ప్రదానం చేశారు.


పురుషుల చాంపియన్ నెల్లూరు జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



మహిళల చాంపియన్ కృష్ణా జట్టు



కేసులో శిక్ష పడుతుందనే భయంతో..

- వ్యక్తిని హత్య చేసిన యువకుడు
- అరెస్ట్ చేసిన నిడదవోలు పోలీసులు


ఘటనా స్థలంలో షేక్ వలీ బాషా మృతదేహం


ఫైల్‌ఫొటో


హత్య చేసిన అనిల్‌కుమార్

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అల్లరి చేసిన కేసు కోర్టులో తుది దశకు రావడంతో శిక్ష పడుతుందనే భయంతో, అమ్మాయి కుటుంబసభ్యులు రాజీకి రాకపోవడంతో ఆదివారం ఉదయం యువకుడు వ్యక్తిని హత్య చేశాడు. హత్యచేసిన అరగంటలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ పీవీ జి.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణం పాటిమీద చింతచెట్టు వీధిలో నివాసముంటున్న షేక్ వలీ బాషా (46) ఆదివారం ఉదయాన్నే నిద్ర లేచి తన ఇంటి కింద ఉన్న కిళ్లీ షాపు తె రుస్తుండగా స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన శిరంగుల అనిల్‌కుమార్ వేటకత్తితో వలీ బాషాను హత్య చేసినట్టు మృతుడి భార్య షేక్ రెహానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ అయిన అనిల్‌కుమార్ 2021లో వలీ బాషా కుమార్తెను అల్లరి చేయడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతుంది. తనపై కేసు ఉండడంతో పెళ్లి కావడంలేదని, మరోపక్క ఈ కేసులో శిక్ష పడుతుందనే భయంతో అనిల్ వలీ బాషాను రాజీ చేసుకుందామంటూ చాలా కాలంగా తిరుగుతున్నాడు. అయితే వలీ బాషా కుటుంబసభ్యులు రాజీకి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అనిల్ పథకం ప్రకారమే వేటకత్తితో వచ్చి వలీ బాషాపై దాడి చేసి హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందిన అరగంటలోనే సీఐ తిలక్ సిబ్బందితో అనిల్‌ను అరెస్ట్ చేశారు. మృతుడి భార్య షేక్ రెహానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రేపు ఖేలో ఇండియా బీచ్ క్రీడల ఎంపికలు

కార్పొరేషన్(కాకినాడ), మే 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 24 వరకు డయ్యూ, యుటి ఆఫ్ దాదర్, నగర్ హవేలి, డామన్, డయ్యూలో జరగబోయే ఫస్ట్ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ క్రీడలు 2025కు రాష్ట్రం తరుపున బీచ్ కబడ్డీ(పురుషులు, బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్(మహిళలు), సెపక్ తక్ర(పురుషులు, మహిళలు) జట్లను ఎంపిక ఎంపికలు మంగళవారం జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు మంగళవారం ఆయా జిల్లాల్లో నిర్వహించే ఎంపికలకు హాజరుకావాలని, ఆయా జిల్లాల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారులను సంప్రదించాలని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. మే 6న బీచ్ కబడ్డీ (పురుషులు), బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్ (మహిళలు) ఎంపికలకు క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లా కృష్ణానది వద్ద జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నెంబరు 9394494645 నెంబరును సంప్రదించాలన్నారు. ఓపెన్ ఏజ్ కేటగిరి, క్రీడా ఆధారిత వయో పరిమితి ఏదైనా ఉంటే వాటి ఆధారంగా వయస్సు నిర్ధాణకు ఆధార్‌కార్డు లేదా పాస్‌పోర్టు, పదో తరగతి మార్కుల లిస్ట్, జనన ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారులు రాష్ట్రంలో స్థానిక నివాసం, పాస్ పోర్టు, స్కూల్ బోనఫైడ్, ఉద్యోగం చేస్తుంటే పోస్టింగ్ ప్రదేశం, ఈ మధ్యనే గెలుపొందిన క్రీడాపత్రాలు, పాస్ పోర్టు ఫోటోలు తీసుకెళ్లాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

మాజీ మంత్రి ఇంట్లో దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కెఎస్.జవహర్ ఇంట్లో దొంగలు పడి రూ. 2,40,000 విలువైన వస్తువులు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నందమూరు రోడ్‌లో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ మాజీ మంత్రి కెఎస్.జవహర్ కుటుంబసభ్యులు గత నెల 28న ఇంటి తాళాలు పెట్టి తిరువూరు మండలం గానుగపాడు వెళ్లారు. ఈనెల 3న సాయంత్రం 4-30 గంటల సమయంలో మొక్కలకు నీళ్లు పోయడానికి వీధి రాజు వచ్చాడు. ఇంటి వెనుక తులపులు తెరచి ఉండడంతో జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్‌కు సమాచారం అందించాడు. హుటాహుటిన వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. హాలులో తలుపులు పగలగొట్టి బెడ్ రూమ్‌లోని 3 బిరువాల తలుపులు తెరచి లోపల ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఉన్నాయి. ఇంట్లో అన్నీ పరిశీలించగా 4 బంగారు ఉంగరాలు (సుమారు 4 కాసులు), 4 సిల్వర్ ప్లేట్లు (సుమారు 2 కిలో గ్రాములు), రూ.45 వేలు నగదు, ఒక వాచ్, 32 ఇంచెస్ సామ్‌సంగ్ టీవీ, 2 సామ్‌సంగ్ ఫోన్లు, కొన్ని పట్టుచీరలు కలిపి సుమారు రూ.2,40,000 విలువైన వస్తువులు దొంగతనం జరిగినట్టు గుర్తించారు. దీనిపై జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

కొరియర్ కార్యాలయంపై పిడుగుపాటు

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): కొరియర్ సర్వీస్ నిర్వహిస్తున్న గదిపై పిడుగుపడిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురంలో జరిగింది. ఈకంప్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్ కార్యాలయంపై పిడుగుపడి కంప్యూటర్, ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలర్పారు. కాలిపోయిన ఎలక్ట్రికల్ పరికరాల విలువ రూ.50వేలుంటుందని నిర్వాహకులు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి సహకారం : ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం హామీ ఇచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో యుపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. యూపీఈఐఎఫ్ ఫౌండర్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, ఛైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సంఘాల పిలుపుతో ఈనెల 7న తలపెట్టిన 'చలో విజయవాడ'కు అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యలో యాజమాన్యాల సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పునాదిలో పాము

కొట్టి చంపిన గ్రామస్తులు


హతమైన పాము

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పునాది రంధ్రాల్లో పాములు సంచరిస్తూ ఉండడంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో ఆదివారం స్థానికులు అమర్చిన వలలో 4 అడుగుల పాము చిక్కుకుంది. దాంతో గ్రామస్తులు పామును హతమార్చారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

రూ.4.57 లక్షల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.57 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. భక్తుల కోసం ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలందజేశారు.


క్యూలో బారులుతీరిన భక్తులు

వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ


ఆలయంలో భీమకవి విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథ శివాచార్య ఆధ్వర్యం లో భైరవబొట్ల మాచరి బ్రహ్మజి శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, పలు హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు భారీఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, లారీ ఓనర్స్ అధ్య క్షుడు దుగ్గన బాబ్జి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు బండే తాతాజీ, వీజీ సత్యనారాయణ, దుగ్గ న బాబ్జి, మీసాల రాంబాబు, పాలిక వీర్రాజు, పాలిక సూరిబాబు, కమిడి భీమశంకర్, పుణ్యమంతుల అప్పారావు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

భారీ వర్షంతో నిలిచిన పాపికొండల బోటు

దేవీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అధికారులు పాపికొండలకు వెళ్లే బోటును నిలిపివేశారు. రోజూ పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి విహారయాత్రికులు పాపికొండలకు వెళ్తుంటారు. ఆదివారం ఉదయం ఈదురుగాలులతో వర్షం కురవడంతో అధికారులు పర్యాటక బోటును నిలిపేశారు. 250మంది అడ్వాన్స్ బుక్ చేసుకున్నారు. అయితే అక్కడికి వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు.

ఆలయం ఆహ్లాదం


ఈ చిత్రం.. అన్నవరం సత్యదేవుని ఆలయంపై అలముకున్న అబ్బులు స్వర్ణ శోభితమై ఆలయ పరిసరాలు మొత్తం ఆహ్లాదరకంగా మారి ఆహా అనిపించిన దృశ్యం

ఫొటోగ్రాఫర్-కాకినాడ

కాకినాడ

గాంధీనగర్ రైతు బజారుకు నేడు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), మే 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ రైతు బజార్లో కూరగాయలు అమ్మే రైతు తాటికొండ వీరచక్రస్వామి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన మృతికి సంతాపసూచంగా గాంధీనగర్ రైతు బజారుకు సోమవారం సెలవు ప్రకటించినట్టు ఎస్టేట్ అధికారి వై.శివ తెలిపారు.



గొల్లప్రోలులో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను ఆరబెట్టిన దృశ్యం



పిఠాపురంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



సామర్లకోటలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీటిని తోడుతున్న రైతులు

భారీ వర్షం... రైతులకు ఆశనిపాతం

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పొలాలు కల్లాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. వర్షానికి తడవకుండా ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా ఏదో ఒక మార్గంలో లోపలికి నీరు చేరడంతో ధాన్యం తడిసింది. వాటిని ఆరబెట్టుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు.

పిఠాపురం/గొల్లప్రోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వరి మాసూళ్లు చివరి దశకు చేరాయి. సాధారణ పద్ధతుల్లో కోసిన వారు ధాన్యం రేటు పెరుగుతుందనే భావనతో పొలాల్లోనే కుప్పలు వేశారు. వర్షానికి తడకుండా కుప్పలపైన గడ్డి, ఇతర రక్షణ చర్యలు చేపట్టారు. వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు సాగించిన రైతులు తేమ శాతాన్ని తగ్గించేందుకు వీలుగా పొలాలు, కల్లాలు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం రాశులను ఆరబెట్టారు. శనివారం సాయంత్రం కురిసిన ఆకాల వర్షానికి నష్టం చేకూరగా, రైతులు ధాన్యం తడవకుండా ఉంచేందుకు బరకాలు, టార్పాలిన్లు కప్పడంతో చుట్టూ చేరిన నీరు లోపలకు రాకుండా మట్టి గట్టు కట్టడంతో పాటు టార్పాలిన్లు ఎగిరిపోకుండా రాళ్లు ఉంచారు. అయితే గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రాశుల్లోకి నీరు చేరింది. అడుగు భాగం నుంచి నీరు రావడంతో ధాన్యం తడిసింది. మధ్యాహ్నం నుంచి ఎండకాయడంతో రైతులు ధాన్యం రాశులను బరకాలు, టార్పాలిన్లలో ఉంచి ఆరబెట్టడం కనిపించింది. కాకినాడ-కత్తిపూడి 216వ జాతీయ రహదారి, పిఠాపురం-సామర్లకోట తదితర ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ధాన్యం రాశులను తరలించే ప్రయత్నాల్లో రెతులు ఉన్నారు. వర్షంతో పాటు గాలులు వీయడంతో మామిడికి నష్టం వాటిల్లింది. పలు మామిడి తోటల్లో పక్వ దశకు వచ్చిన కాయలు రాలిపోయాయి. దాళ్వా అనంతరం అపరాలు సాగుచేసిన రైతులకు వర్షాలు నష్టాన్ని చేకూర్చాయి. మరోవైపు గాలులకు అరటి, బొప్పాయి, మునగ, పందిరి పంటలు దెబ్బతిన్నాయి.

కరప (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్విరామంగా కురిసిన వర్షానికి రైతులు కుదేలయ్యారు. మండు వేసవిలో అకస్మాత్తుగా వర్షం పడడంతో ఆరు బయట ఆరబెట్టిన ధాన్యం, లే-అవుట్‌లు, కల్లాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఉరుకులు పరుగుల మీద పొలాలకు వెళ్లి ధాన్యం తడవకుండా గడ్డి, కొబ్బరాకులు, బరకాలు వంటివి కప్పారు. అయితే అప్పటికే అవి పూర్తిగా తడిసిపోవడంతో ఆరుగాలం పడిన శ్రమ వృథా అయ్యిందని పలువురు రైతులు ఆవేదన చెందారు. పలుచోట్ల ధాన్యం రాశుల చుట్టూ చేరిన ముంపునీటిని బయటకు పోయేలా కచ్చా డ్రెయిన్లు తవ్వారు. చేలల్లో తడిసిన ధాన్యాన్ని మెరకకు చేర్చారు. ఇటుక బట్టీల్లో ఇటుకలు తడవకుండా పూర్తిగా బరకాలు కప్పారు. తడిసిన ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకునే దుస్థితి రాకుండా మద్దతు ధరకు కొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇదే అదునుగా మిల్లర్లు చేసే దోపిడీ యత్నాన్ని అడ్డుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. వేళంగి పీహెచ్‌సీ, కరప ఎంపీ డీవో కార్యాలయం ఎదుట మోకాళ్ల లోతు ముంపునీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, ప్రధాన వీధులు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి మురుగు చేరుకుంది. అకాల వర్షంతో మామిడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది.



కరప మండలం వేళంగి రైస్‌మిల్లు వద్ద రోడ్డుకిరువైపులా బారులుతీరిన ధాన్యం ట్రాక్టర్లపై బరకాలు కప్పిన దృశ్యం



కొత్తపల్లిలో జోరున కురుస్తున్న వర్షం

కాగా ఉష్ణతాపంతో తల్లడిల్లిన వృద్ధులు, చిన్నారులకు ఉపశమనం కలిగించింది.

పిఠాపురం/గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. పిఠాపురం పట్టణంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారితో పాటు వీధుల్లోని రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. డ్రైన్లల్లో పూడిక సక్రమంగా తొలగించక ఎక్కడిక్కడ మురుగునీరు పొంగిపొర్లింది. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఉదయం మార్కెట్‌కు రాకపోకలు సాగించే వారికి వర్షం అడ్డంకిగా మారింది. గొల్లప్రోలులోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి, రాయవరం సెంటర్, గాంధీనగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నీరు పోయే మార్గాలు లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. వర్షంలోనే ప్రజలు రాకపోకలు సాగించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకధాటిగా కురిసిన వర్షానికి ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. డ్రైన్ల నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో చెత్తచెదారాలు కొట్టుకుపోయాయి. ఈదురుగాలులు, పిడుగులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు చల్లని గాలులతో సేదతీరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరబోసిన దాళ్వా ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, మైదాన ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను రక్షించుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. బరకాలు తెచ్చి కప్పే సమయం కూడా లేకపోవడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని పలువురు రైతులు వాపోయారు. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రైన్లు పొంగి ప్రవహించాయి, మురుగు రోడ్లపై చేరి దుర్గంధం వ్యాపించింది. నిత్యం మురుగు కాలువల్లో పూడిక తీయట్లేదని పలువురు ఆరోపించారు.

నేడు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. డీయుజీకేవై స్కిల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 నెంబరును సంప్రదించాలని సూచించారు.

'నీట్' పరీక్ష కేంద్రాల తనిఖీ

జేఎన్టీయూకే, మే 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష కేంద్రాలను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పరిశీలించారు. జేఎన్టీయూకేలోని యూసీఈకే కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండుచోట్లా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్డీవో చెప్పారు.



ఏఎస్పీ సుస్మితతో ఎస్పీ బిందుమాధవ్, సిబ్బంది

ఐపీఎస్ సుస్మితకు ఘన వీడ్కోలు

కాకినాడ క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావం, పారదర్శకత గుర్తింపునిస్తుందని ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. జిల్లాలో ట్రైనీ ఏఎస్పీగా ఎంతో సమర్థవంతంగా పనిచేసి ట్రైనింగ్ పూర్తి చేసుకెళ్తున్న ఐపీఎస్ ఆర్.సుస్మితకు ఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమిళనాడులోని కడలూరుకు చెందిన సుస్మిత 2023 బ్యాచ్ ఐపీఎస్ అని... ఆమె శిక్షణ నిమిత్తం 5 నెలల పాటు కాకినాడ టూటౌన్, తిమ్మాపురం పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించారన్నారు. తదుపరి శిక్షణకు మంగళగిరిలోని డీజీపీ కార్యాలయానికి వెళ్లనున్నట్టు తెలిపారు. సుస్మిత మంచి అధికారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.



కరపలో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): కరప నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మరలా కలుసుకుని సందడి చేశారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కుటుంబ సమేతంగా హాజరై ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చేస్తున్న వృత్తి, కుటుంబసభ్యుల వివరాలను తెలియజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి సముచి తరీతిలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆటపాటలాడి సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. చనిపోయిన ఇద్దరు సహచర విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధి నిధులు సమీకరించాలని, ఆపదలో ఉన్న మిత్రులకు సాయపడాలని, మిలీనియం బ్యాచ్‌గా ఎప్పుడూ కలుస్తూ ఉండాలని తీర్మానించారు.

జర్నలిజంలో అనేక మార్పులు: మాజీ మంత్రి యనమల

కాకినాడ, మే 4(ఆంధ్రజ్యోతి): నాటికి.. నేటికి జర్నలిజంలో అనేక మార్పులు వచ్చాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణ అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఆదివారం జరిగిన ఏపీడబ్ల్యూజే కాకినాడ జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జర్నలిస్టులు అందరినీ ఒకేలా చూసే విధానం రావాలన్నారు. జర్నలిస్టులు తనకు సూచించిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులను అన్నిరకాలుగా ఇబ్బంది పెట్టిందన్నారు. కరోనాలో చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5లక్షలు ఇస్తామని జీవో విడుదల చేసి ఇవ్వలేదన్నారు. ఈ నెలలో జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అక్రిడిటేషన్‌పై నిర్ణయం తీసుకుని కొత్తవి జారీ చేయాలని సూచించారు. సభాధ్యక్షుడిగా ఎన్‌కే దురానీ వ్యవహరించారు. సభలో ఏపీడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.స్వాతిప్రసాద్, ఎన్‌కే దురానీ, యూనియన్ రాష్ట్ర ప్రతినిధి ఎం.శ్రీరామమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు పాల్గొన్నారు.

పెనుగుదురులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ నియోజకవర్గవ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్ (బాబి) తెలిపారు. ఆదివారం ఆయన పెనుగుదురులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, నాయకులు గంటా నానిబాబు, ముమ్మిడి పుష్పలత, గుబ్బల భాస్కరరావు, దాసరి దొరబాబు, కర్రి శ్రీను, ముత్యాలరావు, యడ్ల చిట్టిబాబు, పెంటపాటి చక్రం తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో గైనకాలజిస్టుల సదస్సు


జీజీహెచ్ (కాకినాడ), మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్లో ఫాగ్‌సి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనురాగమయి, కార్యదర్శి డాక్టర్ ఏఎల్ సత్యవతి ఆధ్వర్యంలో ఆదివారం గైనకాలజిస్టుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, విశిష్ట అతిథులుగా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ హాజరయ్యారు. తల్లికి మాతృత్వపు మాధుర్యం అందించడం ద్వారా గైనకాలజీ విద్యకు సార్థకత చేకూరుతుందని డాక్టర్ నరసింహం అన్నారు. అనంతరం మెటర్నల్ ఇమ్యూనైజేషన్‌పై చర్చా గోష్ఠి నిర్వహించారు. డాక్టర్ నరసింహం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.పవన్ కుమార్, డాక్టర్ పద్మజ, డాక్టర్ లక్ష్మీకిరణ్, డాక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



భగీరథుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

'మహనీయుడు భగీరథుడు'

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సు కోసం తన కఠోర తపస్సుతో గంగను దివి నుంచి భువికి తెచ్చిన మహనీయుడు మహర్షి భగీరథుడు అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సగరుల కుల దైవం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం గొడారిగుంట కమ్యూనిటీ హాలు వద్ద గల ఆయన విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు వొమ్మి బాలాజీ, వాసంశెట్టి చిట్టప్ప, మాకిరెడ్డి భాస్కర్‌గణేష్‌బాబు, నక్క కిషోర్, తల్లిబోయిన రాముడు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డీసీసీబీ అధికారులు

డీసీసీబీ ప్రగతిపై సమీక్ష

కాకినాడ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సందర్భంగా కాకినాడ అంబేడ్కర్ భవనంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ప్రగతిపై అధికారులు, సిబ్బందితో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, సీఈవో నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వమించిన రక్తదాన శిబిరంలో డీసీసీబీ జీఎం ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్, ఏజీఎంలు సహా సిబ్బంది రక్తదానం చేశారు. బ్యాంకు ప్రస్తుత పరిస్థితి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సీఈవో దిశానిర్దేశం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం 50 మందికి అన్నదానం చేసినట్టు సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటరమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ప్రజలను చైతన్యపరచడంలో కళాకారుల పాత్ర కీలకం

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరచడంలో నాటక రంగ కళాకారుల పాత్ర కీలకమైనదని పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి, సినీ దర్శకుడు దాసరి నారాయణరావు 78వ జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అఖిల భారత దాసరి యువశక్తి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గోడి వెంకట్ ఆధ్వర్యంలో నాటక రంగ కళాకారులకు సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ రాజశేఖరం కేక్ కట్ చేశారు. కళాకారులు సీహెచ్ వెంకట రమణ మూర్తి, కాటంరెడ్డి సత్యనారాయణ, మణిబాల, చెన్నాప్రగడ నరసింహరావు, గుండోజు అరుణాకర్‌రావులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వై.మాలకొండయ్య, మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, నాయకులు ఇంటి శ్రీనివాసరావు, పేరూరు సత్యనారాయణ, గుబ్బల రాంబాబు, కింతాడ శ్రీనివాసరావు, నేమాని బాబూరావు, సోమిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాటకరంగ కళాకారుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రాధాన్యం: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కేదారశెట్టి వెంకట సూర్య గంగాధర రామారావు, ఉపాధ్యక్షులుగా మద్దాల బుచ్చిరాజు, కేతవరపు కృష్ణ, కార్యదర్శిగా కొత్త దత్తు, అదనపు కార్యదర్శిగా లక్క రాజా, కోశాధికారిగా కొత్త లక్ష్మీనారాయణ, డైరెక్టర్లుగా ఇమ్మిడిశెట్టి ప్రసాద్, కంచర్ల బదరీలతో సంఘ జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లకూరి బంగారం, కాసు శ్రీనివాస్, వానరాశి శ్రీనివాసగుప్తా, గొల్లపూడి సాయి, కేదారశెట్టి నానాజీ, కుసుమంచి పాపారావు, దంగేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు

'డాక్టర్ వెంకన్నరావు సేవలు అభినందనీయం'

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా వేళంగి, చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు, ట్రస్ట్ ఆఫ్ బొండా పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ బొండా వెంకన్నరావు అభినందనీయుడని ఎమ్మెల్యే పంతం నానాజీ కొనియాడారు. వేళంగి శ్రీనివాస నర్సింగ్ హోమ్ స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయుడు డాక్టర్‌గా సుపరిచితులైన వెంకన్నరావును ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఏవీ కృష్ణంరాజు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ పిండి లక్ష్మణమూర్తి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ బొండా సూర్యారావు, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ కాద వెంకటరమణ, డాక్టర్ సాక్షిశ్రావణి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, శాకా శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెంకన్నరావు, ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

దుర్గాడ శివాలయంలో భాను సప్తమి పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆదివారం భానుసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పుష్యమి నక్షత్రం, పుష్యార్క యోగం సందర్భ సమయాన ఆలయ అర్చకులు, పండితులు, సేవా సమితి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు నిర్వహించారు. శరీర ఆరోగ్యం కోసం సూర్యునికి ప్రీతికరమైన త్రిచ, అరుణం, సౌర మంత్రాలతో పారాయణ చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, పండితులు పూజలు జరిపారు.

పిఠాపురంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్ నిర్వహణ

చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి

పిఠాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పిఠాపురంలో ట్రాఫిక్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని సామాజిక కార్యకర్త, మన ఊరు-మన బాధ్యత సంస్థ అధ్యక్షుడు కొండేపూడి శంకరరావు తెలిపారు. ఇక్కడి పరిస్థితులను వివరిస్తూ ఆయన ఎస్పీ బిందుమాధవ్‌కు వినతిపత్రం పంపారు. సాయిబాబా గుడి సెంటరు నుంచి ప్రభుత్వాసుపత్రి సెంటరు వరకు మెయిన్‌రోడ్డుపై సగం దాకా ఆటోలు, రిపేరు షాపులు, తోపుడు బండ్ల వలన ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని వివరించారు. చిన్నమాంబ పార్కు, బంగారమ్మ రావిచెట్టు సెంటర్లు, ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మార్కెట్ తదితర ప్రాంతాల్లో మెయిన్‌రోడ్డునే ఆటోస్టాండ్లుగా మార్చివేసి ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలిపారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో పోలీసులు ఎక్కడా కానరావట్లేదని చెప్పారు. ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీసులను నియమించడంతో పాటు ఆక్రమణలు, ట్రాఫిక్ అడ్డంకులను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శాంతి ప్రార్థనా మహోత్సవాల ప్రచార వాహనాలు ప్రారంభం

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): లూక్ మెమోరియల్ పీస్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ నెల 9,10,11 తేదీల్లో కాకినాడ మెక్లారిన్ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహించనున్న శాంతి ప్రార్థనా మహోత్సవాల ప్రచార వాహనాలను ఏబీసీ జిల్లా అధ్యక్షుడు దొమ్మటి విద్యాసాగర్ ప్రారంభించారు. జిల్లా పాస్టర్స్ అసోసియేషన్లు, వివిధ హోదాల పాస్టర్లు, నాయకులతో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశానికి బిషప్ యెల్చూరి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. మిషన్ టు ది నేషన్ డైరెక్టర్ యెల్చూరి పాపారావు, బిషప్ రెడ్డి జ్యోతికుమార్, యెల్చూరి జోసఫ్, దయాగృహం, యెల్చూరి సుధాకర్, సీటీసీ డైరెక్టర్ విలియమ్స్, సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ కారుణ్య డీమ్డ్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పాల్ దినకరన్ కుటుంబంతో విచ్చేయనున్నారన్నారు. ఏబీసీ ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్, బిషప్ దడాల విలియమ్స్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి శీరం ఐజాక్, దడాల జాషువా గిరి, రాజా చౌదరి, కల్చర్ ఆఫ్ కనెక్టివిటీ సీఈవో విక్టర్ విల్సన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జంగా గగారిన్, మిస్సా విజయ్‌కుమార్, మోజెస్ కిరణ్, దూది పాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ వర్షం

దేవీపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో ఇందుకూరు, ఇందుకూరు పేట, శరభవరం, దేవారం, కొత్తవీధి తదితర గ్రామాల ప్రజలు జన జీవనం స్తంభించింది. అయితే వర్షం ధాటికి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. మామిడి, మొక్కజొన్న, వరి పంటలు తడవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గర్జన సభను జయప్రదం చేయండి

చింతూరు మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల గర్జన సభను జయప్రదం చేయాల్సిందిగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మన్యంలో ఉద్యోగ అవకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. ఈ మేరకు ఈనెల 16న పోతనపల్లిలో గర్జన సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సభకు ప్రతీ ఆదివాసీ స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ ప్రకటించిన ప్రభుత్వం మన్యం ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి స్థానిక నిరుద్యోగ ఆదివాసీలతో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరంతో ఆదివాసీలు సర్వం కోల్పోతున్న క్రమంలో 2013 భూసేకరణ చట్టం మేరకు పరిహారం చెల్లించాలన్నారు. అమరావతి రైతులకు కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలు, పరిహారం పోలవరం నిర్వాసితులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రవ్వ ప్రసాద్, మడకం లక్ష్మణ్‌రావు, అప్పారావు, కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

అడ్డతీగల, మే4(ఆంధ్రజ్యోతి):అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామ సమీపంలో ఉన్న ఊడలమర్రి రేణుకా యల్లమ్మ, చిన్నమస్తా, దక్షిణ కాళీ దేవస్థానం ఆవరణలో జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలతో కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటలకు ప్రత్యేక అభిషేకాలు తదుపరి మండప ఆరాధన కలశస్థాపన, ఎనిమిది గంటలకు క్షేత్ర ఆవరణ దేవతలకు క్షేత్ర శక్తులకు చిన్న మస్తా, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు శిఖర పూజ అనంతరం మహా గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన తదుపరి దేవస్థానంలో సాముహిక వివాహాలు చేపట్టారు. సాయంత్రం 3గంటలకు శ్రీశక్తి దేవి సమేత శ్రీఉచ్ఛిష్ట గణపతి, చిన్నమస్తా శ్రీకదంబ ఈశ్వరుడికి మరియు రేణుకా యల్లమ్మ జమదగ్ని వార్ల దివ్య కల్యాణాలు కనుల విందుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు తిలకించడానికి ఏజన్సీ, మైదాన ప్రాంతాలకు చెందిన వందలమంది భక్తులు విచ్చేశారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఏజెన్సీ నృత్యాలతో భక్తులను అలరించారు. కార్యక్రమానికి కాలభైరవ ఉపాశకులు విచ్చేసి ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారంరాత్రి జాతర నిర్వహించి వెంకటేశ్వరస్వామి కథను గానం చేశారు.

గ్రామ సభకు ఏర్పాట్లు

చింతూరు మే 4(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల గుర్తింపు తదుపరి ఆర్అండ్ఆర్ చెల్లింపులకోసం అవసరమగు డాక్యుమెంట్ల సేకరణ ప్రక్రియలు చింతూరు డివిజన్‌లో వేగవంతమయ్యాయి. ఈమేరకు 41.5 కాంటూరు ముంపు గుర్తింపు గ్రామాలలో చింతూరు ఐటీడీఏ పీవో నేతృత్వంలో గ్రామ సభలు వరుసగా నిర్వహిస్తున్నారు. ఈనెల6న వరరామచంద్రాపురం మండల కేంద్రంలోనూ 7న చింతూరు మండలకేంద్రంలో గ్రామసభల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు నిర్వాసితులు తమకు సంబంధించిన అభ్యంతరాలను, దొర్లిన పొరపాట్లను గ్రామసభలలో వ్యక్తం చేసుకునే అవకాశం కల్పించారు.

గండిపోశమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవీపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గొందూరులో ఉన్న చోదేవారి ఆడపడుచు మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి పవిత్రమైన గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు. టిక్కెట్లు తదితర వాటి ద్వారా రూ.24,150 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మోతుగూడెంలో ఎండా, వానా


మోతుగూడెంలో ఉదయం వర్షం కురుస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వర్షం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు భానుడి భగభగలు దీంతో ఒక్కసారిగా ప్రజలు ఉదయం వర్షానికి సేద తీరారు. మధ్యాహ్నం ఎండకి బెంబేలెత్తారు. ఆదివారం కావడంతో ఉదయం నుంచి వర్షం పడడంతో పర్యాటకులతో మోతుగూడెం, పొల్లూరు పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి.

శరభవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిక్కాల


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దేవీపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా చిక్కాల బూరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దేవీపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరు గ్రామ సమీపంలో దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ వాహనాలు తనిఖీ చేశారు. గోకవరం నుంచి పోతవరం వైపుగా వెళ్లే వాహనాలను నిలుపుదల చేసి రికార్డులు తనిఖీ చేసి సక్రమంగా లేని వారికి జరిమానా విధించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు.


ఇందుకూరు గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ షరీఫ్


జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అకాల వర్షం... అపార నష్టం

● ఈదురుగాలులకు నేలరాలిన మామిడి, తడిసిన ధాన్యం
● జలమయమైన రహదారులు


తునిలో కురుస్తున్న వర్షం


ప్రత్తిపాడు: పెదశంకర్లపూడి వద్ద తడిసిన ధాన్యం రాశులు

ప్రత్తిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి మెట్టప్రాంత రైతాంగానికి అపార నష్టం వాటిల్లింది. గడిచిన ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలులకు ప్రత్తిపాడు మండలంలోని మామిడి రైతులు కుదేలయ్యారు. పక్షం రోజుల కిందట వీచిన భారీ ఈదురుగాలులు, వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్న మామిడి రైతుకు గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా ఈ అకాల వర్షాలు మారి రైతులను నష్టాల ఊబిలోకి నెట్టాయి. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, పోతులూరు, శరభవరం, గజ్జనపల్లి, వెంకటనగరం, చింతలూరు గ్రామాల్లోని మామిడి తోటలు ఈదురుగాలుల వర్షానికి మామిడి రెండోసారి నేల రాలడంతో మామిడి రైతులు కోలుకోలేని నష్టాలకు గురయ్యారు. రాలిన మామిడి అధికశాతం పచ్చడికే వినియోగించుకునేందుకే అవకాశం ఉండటంవల్ల వాటిని పండ్లుగా మార్చడానికి మగ్గపెట్టడానికి లేక పచ్చడి కాయ వెనువెంటనే కొనుగోలు చేసేవారు లేక మామిడి రైతుల పరిస్థితి రెండికీ చెడ్డ రేవడిగా మారింది. అలాగే పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, ఏలూరు, లంపకలోవ గ్రామాల్లో సార్వా వరి నూర్పిడిలు గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. రహదారుల వెంబడి కళ్ళాలుగా నూర్చిన ధాన్యం ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశంలేక వరుసగా వర్షాలు కురుస్తుండటంతో వరి రైతాంగం దారుణంగా నష్టపోయారు. అకాల వర్షాలవల్ల కోలుకోలేని నష్టాలు ఎదుర్కొంటున్న మామిడి, వరి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

తునిలో వడగళ్ల వాన

తుని రూరల్: వాన వీడటం లేదు. గత మూడురోజులుగా రోజుకి రెండు నుంచి మూడు గంటలపాటు కురుస్తున్న వర్షానికి జనజీవనం స్పందిస్తోంది. వీస్తున్న గాలులకు మామిడి పంట దెబ్బతిని కాయలు నేల రాలుతున్నాయి. తుని పట్టణ పురవీధుల్లో నీరురోడ్లపై ప్రవహిస్తున్నాయి. ఆదివారం కురిసిన వడగళ్ల వానతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు.

రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

జగ్గంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని కౌలు రైతులకు మద్దతు ధర ఇవ్వాలని జగ్గంపేట నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గంపేటలో రెండు మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు, కౌలు రైతులు కల్లాలపై వేసిన ధాన్యం తడిసి ముద్దయింది. వెంటనే కలెక్టర్ స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాట్రావులపల్లి గ్రామంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం బృందం పరిశీలించి కలెక్టర్ వెంటనే స్పందించాలని జగ్గంపేట, పెద్దాపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ నెలరోజుల నుంచి కలెక్టర్ అనేక సమీక్షలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లను హెచ్చరించినా, మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తుండడంతో రైతులు వేచి చూశారు. ఈ క్రమంలో అకాల వర్షాలతో వారం రోజుల నుంచి వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ అధికారులుగానీ రైస్ మిల్లర్స్ కానీ స్పందించకపోవడంతో నేటి ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి రైతాంగం ఆరబెట్టిన ధాన్యం మొత్తం తడిసి ముద్దయిందని దీనిని ప్రభుత్వమే బాధ్యత వహించి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, అర్జున్, రమణ, రైతులు పాల్గొన్నారు.

ధాన్యంను పరిశీలించిన మాజీ మంత్రి

అకాలవర్షం కారణంగా తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం అగ్రికల్చర్ అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట వైసీపీ నాయకులు రావుల గణేష్‌రాజా, రామకుర్తి జగన్, గుర్రం మహాలక్ష్మి, భూమాడి గణపతి, సర్ప రఘు, కాపవరపు ప్రసాద్, మొగిలి శ్రీను ఉన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


జగ్గంపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతిని జిల్లా అధ్యక్షుడు నక్కా కిషోర్ అధ్యక్షతన వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భగీరథ జయంతి ప్రభుత్వపరంగా నిర్వహించుకుంటున్నామన్నారు. భగీరథ మహర్షి విగ్రహాన్ని పుష్కర ఎత్తిపోతల పథకంవద్ద ఏర్పాటు చేస్తామని, జగ్గంపేటలో సగర సోదరులకు కమ్యూనిటీ భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, సగర నాయకులు తంగెళ్ళ అప్పారావు, పోట్రూ కృష్ణ, నక్క కృష్ణ, ములికి వీర రాఘవలు, ములికి సత్యనారాయణ, తంగెళ్ళ సుబ్బారావు, నక్కవెంకటేష్, నూకరాజు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఏపూరి రామారావు, సగర సంఘం పెద్దలు భగీరథుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సగర సంఘ పెద్దలు పాల్గొన్నారు.

శంఖవరం: మండల కేంద్రమైన శంఖవరంలో భగీరథుని జయంతి వేడుకలు సగర కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో భగీరథుని విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కఠోర శ్రమ, పట్టుదలతో ఎంతటి ఆశయాన్ని అయినా సాధించవచ్చునని నిరూపించిన మహనీయులు భగీరథ మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో ములికి వెంకన్న, ఉపసర్పంచ్ చింతంనీడి కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం జనసేనపార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని భగీరథుడికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ భగీరథులు ఒంటికాలపై తపస్సు చేసి ఆకాశం నుంచి గంగను భూమిపైకి దించాడని భగీరథుడు గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, మండపాక బాపన్న దొర, వేణుగోపాల్, అడపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో అనేక మార్పులు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

కాకినాడ, మే 4(ఆంధ్రజ్యోతి): నాటికి.. నేటికి జర్నలిజంలో అనేక మార్పులు వచ్చాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణ అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఆదివారం జరిగిన ఏపీడబ్ల్యూజే కాకినాడ జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జర్నలిస్టులు అందరినీ ఒకేలా చూసే విధానం రావాలన్నారు. జర్నలిస్టులు తనకు సూచించిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తానన్నారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులను అన్నిరకాలుగా ఇబ్బంది పెట్టిందన్నారు. కరోనాలో చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.5లక్షలు ఇస్తామని జీవో విడుదలచేసి ఇవ్వలేదన్నారు. ఈనెలలో జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అక్రిడిటేషన్‌పై నిర్ణయం తీసుకుని కొత్తవి జారీ చేయాలని సూచించారు. సభాధ్యక్షుడిగా ఎన్‌కే దురానీ వ్యవహరించారు. సభలో ఏపీడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షుడు కె.స్వాతిప్రసాద్, ఎన్‌కే దురానీ, యూనియన్ రాష్ట్ర ప్రతినిధి ఎం.శ్రీరామమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు పాల్గొన్నారు.

రేపు పీసా ఎన్నికలు

వై.రామవరం, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వై.రామవరంలో ఇప్పటికే పలుమార్లు వాయిదాపడ్డ పీసా కమిటీ వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఎన్నికలు ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఇప్పటికే తొమ్మిదిసార్లు వాయిదాపడ్డ ఎన్నికలను ఐటీడీఏ పీవో ఆదేశాలతో ఈసారి ఖచ్చితంగా పూర్తిచేయాలనే దృక్పథంతో ఓటర్లు పాల్గొనేలా ప్రచారం విస్తృతం చేశారు. గ్రామంలో 768 మంది ఓటర్లకు ప్రస్తుతం 529 మంది ఎస్టీ ఓటర్లు ఉన్నారు. కోరం 176 మంది హాజరైతే ఎన్నికలకు శుభంకార్డు పడుతుంది.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

జగ్గంపేట రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిశాల గ్రామ శివారున పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ టి. రఘునాధరావు తెలిపారు. వారివద్ద నుంచి రూ.6180 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘునాధరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గండేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబాలతో సహా హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఆట, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు 32 సంవత్సరాల తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక నుంచి ప్రతి ఏడాది ఆత్మీయ కలయికను నిర్వహించుకుంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో అధిక 93-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ పిల్లి బోస్‌ను కలిసిన మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఆదివారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడిగా వైసీపీ అధిష్ఠానం నియమించిన సందర్భంగా మురళీకృష్ణంరాజు రామచంద్రపురంలోని కార్యాలయం వద్ద పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్నవరం, వాకపల్లి, ధర్మవరం, తదితర గ్రామాలకు చెందిన అభిమానులు, కార్యకర్తలు మురళీకృష్ణంరాజును సన్మానించారు.

నేడు దోమల మందు పిచికారీ

మోతుగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి):మోతుగూడెంలో సోమవారం ఎస్టీ కాలనీ, పొల్లూరు గ్రామంలో ఐఆర్ఎస్ (ఇండోర్ రెసిడ్యూఆల్ స్ప్రే)చేయనున్నట్లు మోతుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞా తెలిపారు. ఈ మందు స్ప్రే చేయడంవల్ల మలేరియా వ్యాధి భారి రక్షిస్తుందని, ఇంట్లో దాగి ఉన్న దోమలను అణచివేస్తుంది. చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ప్రమాదానికి లోనయ్యే వ్యక్తులకు రక్షణ కల్పిస్తుంది. కొన్ని నెలలపాటు దోమల నివారిస్తుందన్నారు. స్ప్రేయింగ్ చేసే రోజూ ఇంట్లో ఉండే పిల్లలు, వృద్ధులు, గర్భిణులు బయటకి వెళ్లాలి, ఆహారపదార్థాలు, నీటి పాత్రలు మూతపెట్టాలి లేదా కప్పాలి, స్ప్రేయింగ్ చేసే గది 2 నుంచి 3గంటల పాటు మూసివేయాలి. ఇంట్లోని గోడలు, గడియారాలు, దుప్పట్లు తాకకుండా ఉండాలి. స్ప్రేయింగ్ అనంతరం ఇంటిని శుభ్రం చేయవద్దు-స్ప్రే ప్రభావం ఉండేందుకు గోడలను వదిలేయాలి. మీ ఇంట్లో స్ప్రేయింగ్ చేయడంద్వారా మీరు, మీ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ ప్రజ్ఞ అన్నారు.


జెడ్.రాగంపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

గండేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు అన్నారు. ఆయన మండలంలో జడ్.రాగంపేట గ్రామ శివారున సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకుగురై కుటుంబాన్ని రోడ్డున పడేయకండి అని సూచించారు.

డ్రైన్లలో పూడికతీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


డ్రైన్లలో పూడికతీస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో అధ్వానంగా ఉన్న డ్రైన్ల పరిశుభ్రతకు ఆదివారం గ్రామపంచాయతీ చర్యలు చేపట్టింది. ధర్మవరంలో అధ్వానంగా డ్రైన్లు అంటూ ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి బావరాజు కామరాజు స్పందించి పలు డ్రైన్లలో పూడిక తీత తొలగించే చర్యలు చేపట్టారు. డ్రైన్లలో మురుగు నీరు నిల్వ ఉండకుండా సజావుగా బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కార్యదర్శి కామరాజు తెలిపారు.

ఎస్.అన్నవరంలో వెంకన్న బ్రహ్మోత్సవాలు



తునిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరంలో సమ్మోహన రూపుడు ప్రసన్న వేంకటేశ్వరుడు. ఆ దేవ దేవుని బ్రహ్మోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు తొమ్మిదిరోజుల పాటు పురుషోత్తముడికి విశేషపూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. పాత సంచుల వర్తకసంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడి 11వ వార్షికబ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున క్షీరాభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం శ్రీవారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. 5వ తేదీ సోమవారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మత్స్యంగ్రహం,వైనతేయ ప్రతిష్ఠ, 6నధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, సంతాన ప్రాప్తికోసం గరుడ హోమం, 7న సామూహిక లక్ష్మీనారాయణ వ్రతం, చంద్రప్రభ వాహన సేవ,పండిత సదస్యం, 8న ధన్వంతరి హోమం, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీవారిదివ్య కల్యాణమహోత్సవం, 9న శ్రీకృష్ణగోపిక పూజ, అశ్వవాహన సేవ, శ్రీకృష్ణతులాభారం, 10న శ్రీ సుదర్శనహోమం, గజవాహన సేవ,సహస్ర దీపాలంకరణ, శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, 11న నరసింహ జయంతి సందర్భంగా శ్రీలక్ష్మి నరసింహ హోమం, గరుడ వాహన సేవ , దొంగల దోపోత్సవం, తిరువీధి ఉత్సవం, 12న మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, శ్రీపుష్పయాగంజరుగుతాయన్నారు.

వైభవంగా వేగులమ్మ తీర్థం


వేగులమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామదేవత వేగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాడు పరిసర గ్రామ ప్రజలు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా పాలకొల్లు-విశాఖపట్నం కళాకారుల కాంబినేషన్‌లో సాగర ఈవెంట్ డీజే డ్యాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక వేగులమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, కూటమి నాయకులు గోపిశెట్టి శ్రీను, అంబటి బుజ్జిల ఆధ్వర్యంలో బాణాసంచా, తప్పిడిగుళ్ళ సంబరాలు, గరగ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


పాలకొల్లు-విశాఖ డ్యాన్స్ ఈవెంట్ ప్రదర్శన